# భగవద్గీత ఆచరణాత్మకమైన గ్రంథము

లోకమందు పెక్కు భీకర కృత్యముల్
జరుగు కారణంబు అరయవలయు
స్వార్థరహితసేవ సన్నగిల్లుటచేత
అర్థరహిత వాంఛలధికమయ్యె

పాపభీతిలేని పామరత్వముబట్టి
దైవప్రీతిలేని దాని బట్టి
మానవత్వమడగె మానవులందున
విశ్వశాంతికిదియె విప్లవంబు

ప్రేమస్వరూపులారా!

కాలముచేత మారని, చరిత్రచేత మాయని, ప్రళయముచేత తరగని, సృష్టిచేత పెరగని యేసత్యమైతే వున్నదో ఆ సత్యమునకు రూపవిలాసమే భారతీయుల సంస్కృతి. ఈ సంస్కృతికి వేదమే మూలము. వేదమునుండి ఆవిర్భవించినదే ఉపనిషత్తు. ఉపనిషత్సారమే గీత. గీతయొక్క సారమే బ్రహ్మసూత్రములు. ఈ మూడును అవినాభావ సంబంధము, అన్యోన్య ఆశ్రయములు. ఇవి శ్రవణ, మనన, నిధిధ్యాసములతో కూడినవి. ఉపనిషత్తులు శ్రవణాత్మకమైనవి. బ్రహ్మసూత్రములు మననాత్మకమైనటువంటివి. భగవద్గీత నిధిధ్యాసాత్మకమైనది. ఇవి కేవలము జ్ఞానమయమైన స్వరూపములే కాని వాఙ్మయ స్వరూపములు కావు.

కానీ, యీనాడు పవిత్రమైన ప్రస్థానత్రయమును వాఙ్మయముగా భావించటముచేత మానవుడు యుగములు గడచినా, తరములు మారినా తానున్న స్థానమునుండి అడుగైనా ముందుకు పోలేకపోతున్నాడు. భగవద్గీత భారతీయులయొక్క హక్కు అని, మతగ్రంథమని,

sri sathyasai vachanamrutam

యిదేవిధముగా అనేక గ్రంథములు ఆయా మతములను పురస్కరించుకొని ఏర్పడిన మతగ్రంథములని వాదోపవాదములలో దిగటం జరుగుతూ వుంది.

**భగవంతుని గురించి తెలుపు గ్రంథములన్నియు భగవద్గీతలే!**

ప్రేమస్వరూపులారా! మీరు వేరుగా భావించక, సర్వమతముల సారము సర్వగమ్యముల చేరిక యేకత్వమనే దివ్యత్వాన్ని గుర్తించి వర్తించడమనే విశ్వాసము ఏర్పరచుకున్నప్పుడే మనయొక్క జీవితమే కాకుండా దేశమునుకూడను వుద్ధరించినవారమౌతాము. భగవద్గీత ఒక్క భారతీయులకు మాత్రమే చెందినటువంటిది కాదు. దీనిని ఏ మాత్రము దేశ, కాల, మతములకు పరిమితము చేయరాదు. భగవద్గీత కేవలము హిందూమతమునకు సంబంధించినదనే మనము భావిస్తున్నాము. ఇది సంకుచితమైన భావమే! కాలకర్మకారణ కర్తవ్యములను పురస్కరించుకొని యీ పవిత్రమైన గ్రంథము జగత్‌వ్యాప్తిగావించినదనే సత్యాన్ని గుర్తించాలి. అన్ని దేశములకు, అన్ని మతములవారికి యీ భగవద్గీత ప్రాణసమానము. భగవంతునిగూర్చి తెల్పు గ్రంథములన్నియు భగవద్గీతలే! ఖురాను అనేది ఇస్లాముల గ్రంథమని, బైబిలు క్రిష్టియన్సుకు మాత్రమే సంబంధించినదని, ఆదిగ్రంథమనేది కేవలము సిక్కులకు మాత్రమే సంబంధించినదనియు యీవిధముగా కేవలము గ్రంథములను ఆధారముచేసుకొని తమయొక్క ఐకమత్యమును, దివ్యత్వమును కోల్పోతూ ఒకరితోఒకరు అనేకవిధములుగా భేదాభిప్రాయములు పెంచుకొని, భిన్నత్వముచేత, తమయొక్క దివ్యత్వమును గుర్తించుకొనలేక జీవితమును వ్యర్థముగావించుచున్నారు. అమూల్యమైన కాలమును అరక్షణమైనా కూడను వృథాచేయకూడదనేటువంటి సత్యాన్ని వారు గుర్తించుకోలేకపోతున్నారు. అనేకమంది తత్త్వవేత్తలు అనేక భాషలందు అనేక విధములుగా యీ భగవద్గీతను వ్యాఖ్యానించి, అనేక విధములుగా దీనిని వ్యాప్తిగావించుచున్నారు. భగవద్గీతను గురించి ప్రచారప్రబోధలు ప్రపంచమంతయు వ్యాపించినప్పటికి, ఆచరణలో యేమాత్రము కనుపించటములేదు. ఆచరణరూపమైన ప్రచార, ప్రబోధలు యీనాడు అత్యవసరము. భగవద్గీత కేవలము పారాయణగ్రంథము కాదు, ఆచరణయోగ్యమైనటువంటిది. ప్రొద్దుట ఒక స్వాములవారు

sri sathyasai vachanamrutam

దీనిని గురించి అనేకవిధములుగ బోధించారు. విద్యాప్రకాశానందులవారు దీనిని గురించి బోధిస్తూ సమత్వాన్ని నిత్యత్వాన్ని విశ్వసిస్తూ, దివ్యత్వవ్యాప్తి గావించవలసినటువంటి విధానమునుకూడను తెలుపుతూ వచ్చారు.

**పారాయణము చేయుట కాలమును పవిత్రముచేసే కార్యము మాత్రమే!**

అయితే, యీనాటి కాలపరిస్థితిని పురస్కరించుకొని భగవద్గీతను యేవిధముగా యీ జగత్తునకు అందించాలి అనేటువంటి విషయము మొట్టమొదటగా యీ సాధుసంఘము గుర్తించటానికి ప్రయత్నించాలి. భగవద్గీతను ఆధారముచేసుకొని 'కృష్ణుడు ఉవాచ', 'అర్జున ఉవాచ' అని కేవలము దేహధారులను మాత్రమే ఆధారముచేసుకొని ప్రచార ప్రబోధములలో ప్రవేశిస్తున్నారేగానీ యిది సర్వమానవులకు ఆధారమైనటువంటి సత్యమనే దానిని గుర్తించి దేహధారులు కాకుండా, జీవేశ్వరులయొక్క సంబంధమును యిందులో యిమిడ్చి తద్వారా సమాజములో ప్రచారము సలిపినప్పుడే ప్రజలలో అంతోయింతో వుండినటువంటి ఆస్తికస్థితియెంతైనా అభివృద్ధిపొందుటకు వీలవుతుంది. అర్జునుడు యేమడిగాడు, కృష్ణుడు యేమి చెప్పాడు? గీతయందు స్పష్టముగానే వుంటున్నది. ఇంకను మనయొక్క ప్రబోధలు, ప్రచారములు యెందుకు? పారాయణమునకు గ్రంథము చాలదా? పారాయణము చేసినంతమాత్రమున పరతత్త్వము మనకు ప్రాప్తిస్తుందా?

**అంధకారమెల్ల హతమారునే చూడ - వసుధలో దీపంపు వార్తవలన**
**నిరుపేదవాని పేదరికంబు పోవునా - విత్తప్రభావంబు విన్నయంత**
**రోగపీడితుని బల్‌రోగము పోవునా - ఔషధమహిమ విన్నయంత**

పారాయణవల్ల లభించేఫలితమిట్టిదే! పారాయణము చేయటము కాలమును పవిత్రము చేయుటమాత్రమే! పరతత్త్వమును అనుభవించి, పరమాత్మునిలో ఐక్యము గావించుకోటానికి, దీనిని ఆచరించినప్పుడే ఆనందము అనుభవమునకు వస్తుంది. భగవద్గీత అనునటువంటిది ఒక మార్గము మాత్రమే! ఒక మార్గమునందు మనము కూర్చొని ఒక గ్రామము చేరాలని ఆ గ్రామమునకు చేరే మార్గము యిదే యిదే అని వుచ్చరించినంత మాత్రమున మనము గ్రామమును చేరగలమా? పాత్రలో ఉన్న

srisathyasaivachanamrutam

పంచభక్ష్యపరమాన్నములను యెన్ని పర్యాయములు స్మరించినప్పటికి మన పొట్టనిండదు. ఆకలి తీరదు. బలశాంతులూ లభించవు. తట్టలోనున్న పదార్థము పొట్టలో చేరవలెనన్న నోటికి, చేతికి పనిపెట్టాలి.

**గీతను ఒక మార్గముగా విశ్వసించి, భగవంతుని గమ్యముగా తలంచి ప్రయాణము సలిపినప్పుడే మనము గమ్యమును చేరగలము**

అదేవిధముగా మనచేతలు మనభావములు వాక్కు యేక స్వరూపాన్ని ధరించినప్పడే, త్రికరణశుద్ధిగా యీ భగవద్గీత మనకు అర్థమవుతుంది. భగవంతుడు ఒక స్థితి. ఒక గ్రామము వంటివాడు. ఒక గమ్యమువంటివాడు. ఆ గమ్యము మనము చేరవలెనన్న గీత అనే మార్గమును అనుసరించినపుడే ఆ గమ్యాన్ని చేరగలము. గీతను మార్గముగా విశ్వసించి, భగవంతుని గమ్యముగా తలంచి ఆ మార్గములో మనము ప్రయాణము సలిపినప్పుడు, అనగా ఆచరణలో వుంచినప్పుడే, మనము చేరవలసినటువంటి స్థానాన్ని సుక్షేమముగా చేరగలము.

భగవంతుడు చెప్పినటువంటి వాక్యములు ఒకజాతికి, ఒక మతమునకు, ఒక కులమునకు, ఒక వర్గమునకు మాత్రమే సంబంధించినటువంటివి కాదు. ఈ జాతి మతములు గుణములనుండి ఆవిర్భవించినటువంటివి. గుణములు భ్రమ స్వరూపాన్ని ధరించినటువంటివి. ఈ గుణములనే భ్రమ మనయందు ఉండినంతవరకు బ్రహ్మ మనకు ప్రాప్తించదు. భగవంతుడు గుణాతీతుడు, భ్రమరహితుడు, భ్రమను నిర్మూలముగావించేటువంటివాడు. అట్టి భగవంతుని చేరడానికి తగినటువంటి ఆచరణను మనము అనుభూతిలోకి తెప్పించుకోవాలి.

గుణాతీతమైన దివ్యత్వాన్ని గుణములచేత పొందటానికి ప్రయత్నించటము కేవలము భ్రమ అనే చెప్పవచ్చు. భ్రమస్వరూపులైనటువంటి జిజ్ఞాసులకు తిరిగి భ్రమనే మనము బోధించి భ్రమను భ్రమగానే పెంచినందువలన అది వారిని బంధితులనుగావించుచున్నది. మన ప్రబోధలుగాని ప్రచారములుగాని ప్రజా రంజకముగా ఉండి వారికి ఆనందము కలుగజేయవచ్చును. కానీ అత్మతత్త్వమనేటువంటి దానిని పట్టటానికి వీలుగాదు. ఇటువంటి

srisatyasaivachanamrutam

పరిస్థితుల యందు ప్రచారమనేటువంటిది వారికి శ్రేయస్కరమైనటువంటిదిగా బోధించాలి గానీ, ప్రేయస్సునకు సంబంధించినటువంటివిగా వుండకూడదు. వారికి ప్రియములుకదాయని యేవో కొన్ని కథలద్వారా వారిని తాత్కాలికంగా ఆనందపరచేటటువంటి మార్గములో ప్రవేశించరాదు. ఇవి తాత్కాలికమైనటువంటి ఉల్లాసములు, ఉత్సాహములు అందించునేగానీ శాశ్వతమైన, సత్యమైన నిత్యమైనటువంటి దైవత్వాన్ని వారిలో యేమాత్రముకూడను ప్రవేశపెట్టలేవు. పురాణములద్వారా, పవిత్రమైన కథలద్వారా దివ్యత్వాన్ని వర్ణించటము పౌరాణికుల మార్గము. కాని, సన్యసించినటువంటివారు, నిత్యమైన సత్యమైన దైవత్వాన్ని తాము అనుభవించి, పరులకు పంచటానికి తగినటువంటి కృషిచెయ్యాలి.

**భగవద్గీతను ఆచరణయోగ్యమైన అనుష్ఠానరూపమైన గ్రంథముగా సమాజమునకు అందించాలి**

ఎన్నో సంవత్సరములనుండి యెంతో వ్యాఖ్యానముగావించినటువంటి మహనీయులు భగవద్గీత తత్త్వాన్ని ప్రచారప్రబోధలు చేస్తూనే వస్తున్నారు. దీనిని అభ్యసిస్తూవస్తున్నారు. కాని, దీనిని ఎంతవరకు సాధించారు, వారిలో యేవిధమైనటువంటి మార్పు కలిగింది అనే విషయము విచారిస్తే నూటికి ఒక్కరో కోటికి ఒక్కరో కూడను కనిపించరు. మనకు యేపదిమందైననూ సరే, ఆచరణయోగ్యులు చాలు. “గంగిగోవుపాలు గరిటెడైనను చాలు కడివెడైన నేల ఖరము పాలు”. యీనాడు మనము ప్రారంభించవలసినటువంటి కార్యము, భగవద్గీతను ఆచరణయోగ్యమైన అనుష్ఠానరూపమైన గ్రంథముగా విశ్వసించి, ఆచరించి, ఆనందించి, సమాజమునకు అందించటానికి తగిన కృషిచెయ్యాలి. గీతాతత్త్వమును సాధువులు ఆచరణయందు సార్థకముగావించుకోటానికి తగిన ప్రయత్నము చెయ్యాలి. దాని నిమిత్తమే దండ, కమండల, కాషాయవస్త్రములు ధరించారు మీరు. దైవముకోసమే మీరు శిరోముండనము చేయించుకున్నారు. అందువలన, దైవమునకు, మీకు ఉండినటువంటి సంబంధబాంధవ్యాన్ని గుర్తించి వర్తించటమే మీ ప్రధాన లక్ష్యముగా విశ్వసించాలి.

**పాపభయంబుపోయె పరిపాటైపోయెను దుష్కృతంబిలన్**
**శ్రీపతి భక్తిపోయె వివరింపగ లేని దురంతకృత్యముల్**
**దాపురమయ్యె లోకమున తాపసలోక శరణ్యుడైన ఆ**
**శ్రీపతి నామ చింతనయె చేకూరచేయు సుఖంబు మానవా!**

**పుస్తకముల్ పఠించితి పూర్తిగ చూచితి సర్వశాస్త్రముల్**
**నిస్తులమైన విద్యలను నేర్చితినంచును గర్వమేల**
**నీ హస్తయుగంబు మోడ్చి పరమాత్ముని భక్తితో కొల్వలేని**
**యీప్రస్తుత విద్యలన్నియు ధాత్రి నిరర్థకములే కద మానవా!**

ప్రాచీనకాలము నుండి పవిత్రమైన భారతదేశమునందు అనుష్టాన ప్రియులైన పెద్దలను అనుసరించుచునే పిల్లలు జీవిస్తూ వచ్చారు. పెద్దలైనవారు యేవిధమైన మార్గమును అనుసరిస్తారో, దానినే పిల్లలు, అజ్ఞానులు, అమాయకులు ఆధారముగా తీసుకుంటారు. కనుక, యీనాడు అన్నివిధముల పెద్దలైనటువంటివారు, మహనీయులైనటువంటివారు, మహాత్ములైనటువంటివారు ఆచరించి చూపిన మార్గముపైననే యీ జగత్తు నిలచి వుంటున్నది. ఈ మహనీయులపైన అనేక బాధ్యతలుకూడను వుంటున్నాయి. నాయకులుగా వుండినప్పుడు దానికి తగినటువంటి బాధ్యతలనుకూడను మనము వహించవలసివస్తుంది. యీనాడు మనము అధికారముకొరకు ప్రాకులాడు తున్నాము కానీ, కర్తవ్యాన్ని గుర్తించుకోవటంలేదు. ఇది దేహము ద్వారానే సాధించాలి. దేహముద్వారానే ఆనందించాలి. "శరీరమాద్యం ఖలు ధర్మసాధనం". కాన, దేహమును ఆధారముచేసుకొనియే దేహిని మనము గుర్తించాలి.

**దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్**
**దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావుపుట్టుకల్**
**మోహనిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబు చూడ**
**ఆ దేహియె దేవదేవుడని మదిన్ గమనించుడు ఆత్మరూపులై**

srisathyasaivachanamrutam

ఈ జగత్తంతయు బ్రహ్మమయము. బ్రహ్మమయమైన జగత్తంతా కర్మమయము. సృష్టి అనునదే పెద్ద కర్మ. కాయమే ఒక పెద్దకర్మ. కర్మ అనగా కేవలము ఒక ఆత్మశక్తి అనియే చెప్పవచ్చును. దీనినే జీవశక్తియనికూడ పిలువవచ్చు. ఈ జీవశక్తికి ఉపాధియే శరీరము. జీవశక్తికి ఉపాధియైనటువంటి దేహముద్వారా కర్తవ్యమును గుర్తించటానికి తగిన కృషిచేయటమే సాధన. దేహమే కర్మ క్షేత్రము. ఆత్మయే బ్రహ్మక్షేత్రము. అదియే ధర్మక్షేత్రము. కనుక కర్మక్షేత్రమైనటువంటి దేహముద్వారా ధర్మక్షేత్రమైనటువంటి బ్రహ్మను మనము చేరటానికి తగిన కృషిచేయటమే యీ భగవద్గీతయొక్క ప్రధానసందేశము.

**రూప, నామములు అనిత్యము, సచ్చిదానందము నిత్యము, శాశ్వతము**

> **హృదయక్షేత్రమనే క్షేత్రమందు కలదు ఒక్క కల్పతరువు**
> **దానిచుట్టు వనస్పతుల కలపకంప పెరిగియుండు**
> **కలుపుతీసి చూడరయ్య కల్పతరువు కానపడును.**
> **అదియే శుభేచ్ఛనొసగు శుభకామధేనువు.**

కేవలము "బ్రహ్మ సత్యం జగత్ మిథ్య" యని వాక్యములతో చెప్పినంత మాత్రమున చాలదు. జగత్తంతయు బ్రహ్మమయమే! కానీ యీజగత్తు రూపనామములతో కూడియుండటంచేత యిది నిత్యానిత్యములతో కూడివుంటుంటాది. ప్రతి పదార్థమునందుకూడను "అస్తి భాతి ప్రియం" అదే "సత్ చిత్ ఆనంద" స్వరూపముతో వున్నది. దానినే మన వినియోగనిమిత్తమై రూపనామములతో వ్యవహరిస్తున్నాము. రూపనామములు మాత్రమే అనిత్యముగానీ సత్ చిత్ ఆనందమనేటువంటిది నిత్యము, శాశ్వతము. అది 'నిర్గుణం, నిరంజనం, సనాతనం, నికేతనం, నిత్యశుద్ధ బుద్ధముక్త నిర్మలస్వరూపిణం'. అట్టి నిత్యసత్యమైనటువంటి ఆత్మ తత్త్వమును మిథ్యయని చెప్పుటకు యెట్లు సాధ్యమగును? దృశ్యమునకు రూపమున్నదిగానీ దృష్టికి రూపములేదు. దృశ్యముచేతనే మనము ద్రష్టను అనుభవించాలి. కనుక, రూపనామములు లేనటువంటి దృష్టితో ద్రష్టను మనము అనుభవించటమే సరియైనటువంటి సాధన.

మనము జగత్ సంబంధమైన వ్యవహారములలో వుండి, వాటితో సన్నిహిత



sri sathyasai vachanamrutam

సంబంధబాంధ్యవములుంచుకొని, దానిని త్యజించటమంటే యిది చాలా కష్టమైన విషయము. గుండుపైన నిలచిన వ్యక్తి తాను నిలచుకొని గుండును పక్కకు నెట్టాలంటే ఇది సాధ్యమయ్యేటువంటి పని కాదు. గుండును ప్రక్కకు నెట్టాలంటే గుండు దిగి తాను ప్రక్కకు నెట్టటానికి ప్రయత్నించాలి. దీనినే వైరాగ్యమని చెబుతూవచ్చారు. వైరాగ్యమనగా -

**ఆస్తి ఆలి వీడి అడవికేగుటకాదు**
**భావమందు దుష్టభావము వీడుటే**
**త్యాగమగును అదియె యోగమగును**

అందులో మనమువుండికూడను దానితో సంబంధబాంధవ్యములేకుండా మనయొక్క చిత్రమును పరమాత్మని హత్తుకొన్నట్టుగా చూచుకొనుటకు ప్రయత్నించాలి. ఉద్ధవుడు కృష్ణునిదగ్గరకు వచ్చినప్పుడు, "స్వామీ! గుణాతీతమైనటువంటివారికి కదా, నీ తత్త్వము గుర్తించటానికి వీలవుతుంది. వ్యామోహకారణముచేత, దేహకారణముచే, బుద్ధికారణముచేత తపించేటువంటి, యీ అజ్ఞానులైన గోపికలకు నీయొక్క తత్త్వము యేవిధముగా అర్థమవుతుంది? వారికి నీవు ఏవిధముగా వశము కాగలవు?" అని ప్రశ్నిస్తాడు. అప్పుడు కృష్ణుడు "ఉద్ధవా! గోపికల చిత్తము గుర్తించటానికి నీకు సాధ్యము కాదు.

**అత్తలు మొత్తుకున్న మరి భర్తలు కత్తులు నూరుచున్న**
**నోరెత్తరు యెటకేగరు భీతిలబోరు**
**గోపికల్ పొత్తములందు చిత్తరువుల**
**రీతి వారిలో నుండు కృష్ణుడు.**

ఒక కాగితముపై హత్తుకున్నటువంటి చిత్తరువు వంటివి, గోపికల హృదయములు. ఆ చిత్తరువును కాగితమునుండి వేరు చేయుటకు వీలుకాదు. అదేవిధముగనే, వారి హృదయమునందు నా చిత్తరువు హత్తుకొనిపోయింది. సాధకుల చిత్తమునందు భగవంతుడు హత్తుకొని పోయినప్పుడు వీరు అన్యకార్యములు నిర్వర్తిస్తున్నప్పటికి, అవి భగవత్ కార్యములుగానే రూపొందుతాయి", అని బోధించాడు.



sri sathyasai vahini amrutam

ముఖ్యముగా మీరు యీ భగవద్గీతా ప్రచార, ప్రబోధలయందు కంకణము కట్టుకొని దేశవ్యాప్తముగా భగవత్ తత్త్వాన్ని ప్రచారము సలుపుతూ వుండటం చాలా ఆనందకరమైనటువంటి విషయము. అయితే, సమాజము నందున్నటువంటి వ్యక్తులకు ఈ కలియుగప్రభావమువల్ల తెలివితేటలు అధికముగను, గుణము చాలా అల్పముగను వుంటున్నది. చదువులు పెరుగుకొలది సందేహములుకూడ పెరుగుతూ వుంటాయి. ప్రతి చిన్నవిషయాన్ని కూడను విమర్శించుటకు ముందంజ వేస్తారు. అర్థము చెప్పినను, గుర్తించటానికి శక్తిలేకపోయినప్పటికి, విమర్శించుట మాత్రము చేస్తూ చాలా విఱ్ఱవీగుతుంటారు. ఇది అల్పజ్ఞులయొక్క లక్షణము. ఇలాంటి పరిస్థితులను మనము గుర్తించి, వారికి యెట్టి సందేహములకుకూడను అవకాశములేనటువంటి మార్గము అవలంబించాలి. దైవాన్ని సంపూర్ణముగా విశ్వసించినటువంటివారు మీరు. భగవంతుని దివ్యతత్త్వమును జనసామాన్యానికి ప్రచార, ప్రబోధలద్వారా అందించడానికి మీ జీవితాన్నే అంకితము గావించినటువంటి త్యాగులు. ఇంద్రియములను నిగ్రహించి ఆ దైవత్వాన్ని మీ చిత్తమునందు హత్తుకునేట్లు చేసుకున్న యోగులు. అయితే, యీనాడు మన ప్రచార ప్రబోధలచేత ప్రజలలో కొన్ని రకములైన సందేహములను మనకు మనమే కల్పించుచూ వస్తున్నాము. దైవము ఒక్కడే! అతను సర్వవ్యాపకుడు, సర్వజ్ఞుడు, సర్వశక్తిమయుడు అని మనమే చెపుతున్నాము.

**బ్రహ్మతత్త్వము ఆత్మరూపములో ప్రతిజీవియందు ఉంటున్నది**

**మతములన్నియు వేరు మార్గంబు ఒక్కటే**
**వస్త్రభేదమువేరు దారమొక్కటే**
**శృంగారములు వేరు బంగారమొక్కటే**
**పశుల వన్నెలువేరు పాలు ఒక్కటె**
**దర్శనంబులు వేరు దైవంబు ఒక్కటె**
**పూలవన్నెలు వేరు పూజ ఒక్కటె**
**తెలియలేకను మానవుల్ తెలివి తప్పి**

srisathyasaivahini.org

బ్రతుకు కోసము బహుబంధ బద్ధులైరి.

ఈ బ్రతుకునిమిత్తమై మనము యిన్ని రూప, నామములను కల్పించుకొనుచున్నామే కాని యథార్థమైన దృష్టితో పరికించిన అందులో వున్నది ఒక్కటే! అదే "ఏకోహం బహుస్యాం" కొన్ని నిముషములముందుగా ఒక స్వామివారు చెప్పారు. బల్బులు యెన్నియో వున్నాయి. కానీ మనము మెయిన్‌స్విచ్ ఆఫ్‌చేస్తే అన్ని బల్బులు నిరర్థకమైపోతాయి. అదేవిధముగా మానవులందరు వివిధ రంగులతో వివిధ రూపనామములతో కూడినటువంటి బల్బులవంటివారు. "సూత్రే మణిగణా యివ" అని అన్ని పూవులయందు కూడను ఒకేదారము చేరినట్టుగా అన్ని బల్బులయందును దివ్యత్వమనే ఆత్మతత్త్వము ఒక్కటిగానే వుంటున్నది. అట్టి తత్త్వాన్ని మనము సమాజములో ప్రబోధిస్తూ రాముడు వేరు, కృష్ణుడు వేరు; బ్రహ్మ వేరు, విష్ణువు వేరు: ఈశ్వరుడు వేరు అనేటువంటి అభిప్రాయమునకు కొంత అవకాశము యిచ్చినప్పుడు, దీనిపైన వాదోపవాదములు ప్రవహిస్తాయి. బ్రహ్మతత్త్వమనేటువంటిది ఆత్మస్వరూపములో ప్రతిజీవునియందు వుంటున్నది. అదియే ప్రణవస్వరూపమైనటువంటి 'ఓం యిత్యేకాక్షరం బ్రహ్మ' అనింది వేదము. ఆ బ్రహ్మనే "అయ మాత్మా బ్రహ్మ" అదే ఆత్మగా వచ్చింది అన్నారు. కనుక ప్రణవము, బ్రహ్మ, ఆత్మ ఇవన్ని ఏకస్వరూపము ఐనవి. కనుక దైవత్వమనేటువంటిది ఈ జగత్తునందు ప్రత్యేకముగా కానరాదు. సర్వనామములు భగవంతునివే, సర్వరూపములు భగవంతునివే! కానీ, తాను మాత్రము నిత్యసత్యమై ప్రకాశిస్తుంటాడు. ఈ బ్రహ్మ తత్త్వమును అనేకవిధములైన లక్షణములతో వర్ణిస్తూ వచ్చింది వేదము. అదే "శబ్దబ్రహ్మమయి, చరాచరమయి, జ్యోతిర్మయి, వాఙ్మయి, నిత్యానందమయి, పరాత్పరమయి, మాయామయి, శ్రీమయి" అని, అష్టైశ్వర్యస్వరూపిణిగా నిరూపించింది. ఇది అష్టైశ్వర్య స్వరూపుడైనటువంటి బ్రహ్మతత్త్వము.

**భక్తితత్త్వమునందు తన్మయత్వము చెందటం భక్తులకు భగవంతునికి మాత్రమే అర్థమవుతుంది**

భాగవతమునందు భక్తుల ప్రీతి నిమిత్తమై భక్తుల ఆకర్షణ నిమిత్తమై,

sri sathyasai vahini amrutam

భగవంతునియందు భక్తి, ప్రపత్తులు అభివృద్ధిగావించుకొనే నిమిత్తమై కొన్ని రకములైన ఆకర్షణలను యిమిడ్చివుంటారు. ఇది పౌరాణికము. కృష్ణునియొక్క పవిత్రమైనటువంటి దివ్యత్వముకోసమై అనేక విధములుగా ఆరాటపడుతూ వచ్చారు, ఎందరో భాగవతోత్తములు. దీనినే భక్తి అని పేరు పెట్టారు. ఈ భక్తిలో తన్మయులుగావచ్చు, ఆత్మారాములుగావచ్చు, ఉన్మత్తులుకూడను కావచ్చు. అట్టి పరిస్థితియందు నిత్యానిత్యవిషయపరిశీలన శూన్యమవుతుంది. ఏదినిత్యము, యేది సత్యము అనే విచారణ శక్తి వుండి కూడను దానిని వారు మరచిపోతారు. ఆ ప్రేమ ప్రభావము అట్టిది. ఒకానొకసమయములో కృష్ణుడు రాకపోవటముచేత గోపికలందరు అడవులలో ప్రవేశించి మొక్కలను, వృక్షములను, పువ్వులను కూడను కృష్ణుని గురించి ప్రశ్నిస్తూ వచ్చారు. మొక్కలకు చెప్పేటువంటి నోరున్నదా, పూవులకు చూచేటువంటి కన్నులున్నవా? వృక్షములకు యీ గోపికలు ప్రార్థించేటువంటి ప్రార్థనలు వినేటటువంటి చెవులున్నాయా? కానీ యివన్నియు వారేమాత్రము యోచించలేదు. ఈ పరిశోధనలలోపల వారు తమ కాలమును వ్యర్థము చేయలేదు. "నల్లనివాడు పద్మనయనంబులవాడు కృపారసంబు పైజల్లెడివాడు", యీ విధముగా వర్ణిస్తూ, "ఓ మల్లియలారా! మీరెవరైనా కృష్ణున్ని చూసినారా?" అని ప్రశ్నించారట! ఇది ప్రేమతో ఆవిర్భవించినటువంటి ప్రభావము. అది భక్తులకు, భగవంతునికి మాత్రమే అర్థమవుతుంది కానీ, అన్యులకు అర్థము కాదు.

గోపాలుడు గోపాలురతో, గోవులతో, వత్సములతో అరణ్యములో వుండిన సమయమునందు బ్రహ్మ యితనిని పరీక్షించగోరి గోవులను, గోపాలురను, వత్సములను దాచిపెట్టినట్టుగా భాగవతము చెప్తుతుంది. సర్వజ్ఞుడైన కృష్ణుడు తిరిగి సర్వమును సృష్టించి తాను యేవిధమైన కొరతా లేకుండా యథాస్థితిగా అనుభవించినట్టుగా, ఒక సంవత్సరము తరువాత బ్రహ్మ వచ్చి చూచినట్టుగా భాగవతములో వర్ణింపబడింది. ఈవిధమైన వర్ణనలు భక్తులకు, కృష్ణునిపై మోహములో మునిగినటువంటి చిత్తములకు చక్కగా అర్థమవుతాయి. కాని, బ్రహ్మవేరు కృష్ణుడు వేరు, బ్రహ్మ కృష్ణుని పరీక్షించాడు అనేటువంటి విషయము సామాన్యమైన మానవులకు అర్థము కాక కొన్ని సందేహములు కలుగుతాయి. ఈ సందేహములవల్ల మనయొక్క బోధలను వారు విశ్వసించలేకపోతుంటారు. కొన్నికొన్ని

srisathyasaivahini

సమయములందు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల తత్త్వమును విడివిడిగా భావిస్తూ వర్ణిస్తూ వుంటారు. ఈశ్వరుడు రామనామమును స్మరిస్తూవుంటాడని, 'రమేరామేమనోరమే' అన్ని కొన్ని విధములైనటువంటి వాక్యములతో ప్రబోధలు చేస్తుంటారు. ఈనాటి విద్యార్థులు ఇలాంటి విషయములను విజ్ఞానశాస్త్ర సిద్ధాంతములకు విరుద్ధమైనవిగా భావిస్తుంటారు. భగవంతుడు ఒక్కడేయని చెబుతూ, తిరిగి రాముడు ఈశ్వరుని, ఈశ్వరుడు రాముని కొన్నివిధములుగా పూజిస్తూ వర్ణిస్తూ వారి నామము వుచ్చరిస్తూ వుంటుంటే దీని అంతరార్థమేమని ప్రశ్నించేవారుకూడా ఉంటారు. మీకు తెలుసును, భగవత్తత్త్వమును అందరూ తెలుసుకొనేటువంటి శక్తి, సామర్థ్యములు కలవారు కాదు.

**భారత, భాగవత, రామాయణగాథలను గురించి ప్రజలలో అనుమానములు రేకెత్తే విధముగా మనము ప్రచార, ప్రబోధలు చేయకూడదు**

ప్రేమస్వరూపులారా! పవిత్రమైన మన భారతీయ చరిత్రలయందు మహర్షులయొక్క తత్త్వాన్ని అనేకవిధములుగా వర్ణిస్తూవుంటారు. వాటిలోని అంతరార్థములు, ఆనాటి పరిస్థితులు పురస్కరించుకొని కవులు, పండితులు ఆవిధమైన మార్గాన్ని అందించి వుండవచ్చు. దీని అంతరార్థమే వేరుగా వుండవచ్చును. ఇంద్రియనిగ్రహులైనటువంటివారు ఈవిధముగా చలించరు అనేది సత్యము. కాని, మహర్షులు ఆవిధముగా చలించారు అనేటువంటి కథలు యీ గ్రంథములద్వారా ప్రపంచములోపల అనేకవిధములైనటువంటి నాస్తికత్వము అభివృద్ధి చెందటానికి దోహదం వుంటుంది. మహర్షులు, మహాత్ములు యీ మతములకు, కులములకు, వర్ణములకు అతీతమైనటు వంటివారు. కనుక, మీ ప్రబోధలయందు మతములు, కులములు, వర్ణములగురించి యేమాత్రము ప్రస్తావించకుండా వుండటము చాలా మంచిది. కేవలము ప్రజలను ఉత్సాహపరిచే నిమిత్తమై చేసే యిలాంటి చిన్నచిన్న విషయాలలో ప్రవేశించి మనయొక్క ఘనతను కోల్పోవటానికి అవకాశం యివ్వకూడదు. ఇలా చేయడంవలన అనంతమైన, అఖండమైన దైవత్వాన్ని అల్పత్వముగా భావించుకోటానికికూడను మనము అవకాశమునందిస్తున్నాము. భారత, భాగవత, రామాయణాల్ని పురస్కరించుకొని భగవంతుడు ఆచరించినటువంటి కొన్ని

srisathyasaivachanamrutam

కర్మలను మనము సమాజములో కొన్ని విరుద్ధమైనటువంటి భావములతో అందించినప్పుడు, ఆ మహత్తర చరిత్రలయందు ప్రజలకు కొంతవరకు అనుమానములు ప్రబలడానికి మనము అవకాశమునందిస్తున్నాము.

**అనేకత్వములోని ఏకత్వమును బోధించడానికి కృషి చేయాలి**

కొన్ని చిన్న ఉదాహరణములు: "ఈ పాండవులు యింత భక్తులే! పరమాత్ముడే అన్నివిధములుగా అండదండగా వున్న పాండవులకు యీ కష్టములెందుకు ప్రాప్తించాలి?", అని ఒక ప్రశ్న. "సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే రామావతారమెత్తినపుడు అతని భార్యకు యిన్ని కష్టములు కలుగవలసినటువంటి అవసరమేమిటి?", అని మరొక ప్రశ్న. "ఇంద్రియాతీతుడు, గుణాతీతుడు అయినటువంటి భగవంతునకు యీవిధమైనటువంటి సంసారములు అంట కట్టడమనేటువంటిది సరైనటువంటిదేనా?", అని మరొకప్రశ్న. కానీ, యీ ప్రశ్నలకు మనము యేమాత్రము చలించనక్కరలేదు. దైవతత్త్వములో వుండినటువంటి అంతరార్థము వేరుగా వుండవచ్చును. కానీ, బాహ్యార్థాన్ని పురస్కరించుకొని కొందరు యీ అవకాశమను ఆధారముగా చేసుకొని వాదోపవాదములలో దిగవచ్చును. వాదములవల్ల విరోధములు పెరుగునేకానీ, తరగవు. కనుక సాధ్యమైనంతవరకు ఈ పురాణములను ప్రచార, ప్రబోధలు చేసే మహనీయులందరు కేవలము దైవత్వాన్ని యేకత్వముగావిశ్వసించి, దైవత్వము అఖండమైన అనంతమైన వ్యాపకత్వమని బోధించటానికి తగిన కృషిచేయాలి. అనేకత్వములోని యేకత్వమును వారికి బోధించటానికి పూనుకోవాలి. ప్రతి ఒక్కటికూడను అనుభూతిలోనికి తేవటానికి తగిన కృషి చేయాలి.

**కాలమును అరక్షణంకూడ వ్యర్థము చేయకూడదు**

ఈనాటి పరిస్థితిలో పల్లెలయందుకూడను విజ్ఞానము అభివృద్ధి గాంచుచూ వచ్చుచున్నది. ఎక్కడ ఏ సన్యాసిని చూచిననూ 'మీ వల్ల యీ సమాజమునకు కలిగేటువంటి మేలు యేమిటి? మీరు చేసేటువంటి పనియేమిటి?' అని ప్రశ్నించేటువంటి అవకాశము ఏర్పడింది. ఒకానొక సమయంలో మళయాళ స్వామి దీనినిగురించి ఒక పద్యము వ్రాసి

ప్రచారము చేశారు. అది సత్యమైనప్పటికి, దానియందున్న అంతరార్థాన్ని అందరూ గుర్తించుకొనే శక్తిసామర్థ్యములు కలుగవు.

**కాషాయ వస్త్రంబు కట్టిన మాత్రాన - కరతలామలకంబు కాదు భక్తి**
**నోటితో నామంబు వుచ్చరించుటచేత - చేసిన పాపంబు చెదరిపోదు**
**గీతను చేబట్టి కేకలువేసిన - పుణ్యంబు మనయింట ప్రోగుపడదు**
**చెప్పుమాటలకు చేసెడి చేతలకు - సంయమమున్నవాడె సాధువగును**

అన్నారు. మళయాళస్వామి యీ విషయాన్ని అనేకమంది శిష్యులకు బోధించేటువంటివారు. అతడు చాలా చిత్తశుద్ధి కలిగినటువంటివాడు. పవిత్ర హృదయము, విశాలమైన భావములు. అతనియొక్క గురుత్వాన్ని మీరు అనేకవిధములుగా వర్ణిస్తూ వుండిప్పటికిని అతని ఆశయాలను మాత్రము అతను ఆశించినట్టుగా నెరవేర్చలేకపోతున్నారు. కేవలము యిట్టి సమావేశములందు మాత్రమే గురువును స్తోత్రము చేయుచు కొన్ని నిమిషములు వ్యర్థము గావిస్తున్నారు. గురువు అనేటువంటివాడు అమూల్యమైన మాణిక్యమువంటివాడు. రత్నమువంటివాడు. అట్టి గురువుయొక్క నామమును మీరు బహిరంగముగా వుచ్చరించనక్కరలేదు. మీ హృదయములో స్మరించి, ప్రార్థించి, తిరిగి ఆ కాలమునుకూడను ప్రజలకు వుపదేశము చేసేటువంటి విషయాలలో ప్రవేశపెట్టినప్పుడు మీరు యెంతో వుపకారముచేసినవారవుతారు. మీవెంటనే, జంటనే, కంటనే, యింటనే వుండినటువంటి గురుత్వానికి బహిరంగముగా యెందుకు ప్రార్థనచేయాలి? మీకు యిచ్చినటువంటి పది నిముషములలోపల యీ గురుప్రార్థనలోనే ఐదు నిముషములు పోతే ప్రజలకు అందించవలసిన విషయములో మీ కాలము తగ్గిపోతుంది. ఒక్కసారి చిత్తములో నమస్కరించుకొని గురువు అనుగ్రహమును అందించమని కోరి, మీరు ప్రారంభిస్తే సరిపోతుంది. ఈవిధముగా మనము కాలమును పోషించుటకు ప్రయత్నించాలి. "కాలాయనమః కాలకాలాయనమః కాలనిర్మితాయనమః" అని కాలమే భగవత్ స్వరూపుడు. కనుక, కాలమును మనము అరక్షణంకూడ వ్యర్థము చేయకూడదు. యీవిధమైన కొన్ని మార్పులను గావించుకొని సమాజములో ప్రవేశించి

sri sathyasai vachanamrutam

ఆదర్శవంతమైన రూపములో మార్పు కల్గించినప్పుడే మీరు సన్యసించినందుకు, ప్రచార ప్రబోధలలో ప్రవేశించినందుకు, ఆశించిన ఆశయాలను అందుకోవటానికి వీలవుతుంది.

**భగవంతుడొక్కడినే ఆశ్రయించాలి**

**వ్యక్తి ముక్తి గోరుట స్వార్థమగును**
**తానె తరియించగోరుట ధర్మమగునా?**
**పరుల తరియింపగోరుటె భాగ్యమగును**
**తరచిచూడ అతనె నిజమైన మానవుండు**

తనకు తాను తరించుకోవటానికి తగిన ప్రయత్నముకంటె తనతోటి మానవులను తరింపచేయటానికి తగిన కృషిచేయటమే సమిష్టి స్వరూపమైన సర్వేశ్వరుని ప్రార్థించినట్టుగా వుంటుంది. ఇదియే "త్యాగేనైకే అమృతత్వమానసుః" ఇట్టి త్యాగమునకు మనము సిద్ధముగా వుండాలి.

మన కార్యక్రమమునందు యీనాడు కడపటి దినము. కనుక, కొన్ని కొన్ని విషయములు అధికకాలము తీసుకున్నప్పటికి సరైన రీతిలో తీర్చిదిద్దుకొనుటకు మనము తగిన ప్రయత్నము చేయాలి. మరొకటి; మనము శిష్యులపైన ఆధారపడి వుండకూడదు. కారణమేమనగా, ఆ విధంగా చేసినప్పుడు మనము వారికి దాసులుగా మారిపోతాము. మనకు వారు దాసులు కావాలి కాని, మనము వారికి దాసులు కారాదు. మనము ఒక్కరికి మాత్రమే దాసులము కావాలి, దైవానికి మాత్రమే! మన ఆశ్రమముల అభివృద్ధినిమిత్తమై సరియైనటువంటి పోషణ నిమిత్తమై భగవంతుడొక్కడిని మాత్రమే ఆశ్రయించాలి. నిజముగా మన కర్తవ్యాన్ని మనం నిర్వర్తించుకుంటూపోతే మనకార్యములకు యెట్టి ఆటంకములు జరుగవు. మనకు దేనియందు కొరత వుండదు.

**నిస్వార్థ, నిర్మల ప్రేమయే సాయి ఐశ్వర్యము**

ప్రేమస్వరూపులారా! మీరు నమ్మవచ్చు నమ్మకపోవచ్చు దానికి నేనే యథార్థము. నేనే నిదర్శనము! ఈ దేహమునకు 61వ సంవత్సరము ప్రారంభమైనది. ఇంతకాలమైనా, ఒక్క



srisathyasaivachanamrutam

అరక్షణమైనా ఎవ్వరిముందు నేను చేయి చాపలేదు. నాకిది కావాలని నేను యేనాడూ కోరలేదు.

**సాయికున్నట్టి ఐశ్వర్యసంపదలకు**
**సాటి సంపద కలదె యెవ్వారికైన యేనాటికైన**

సాయి ఐశ్వర్యమేమన్న స్వార్థరహితమైన, నిత్యనిర్మలమైన ప్రేమ ఒక్కటే! అదే సాయి ఐశ్వర్యము. అట్టి ఐశ్వర్యమును మనము అభివృద్ధిగావించుకుంటే యీ ప్రపంచమంతా మన చేతిలో ఒక బంతిగా మనము ఆడించుకోవచ్చు. మీ సాధనలు మీరు చేయండి. సమాజములో ప్రవేశించి ప్రజలకు మీ సాధనయొక్క అనుభూతులను అందివ్వటానికి ప్రయత్నించండి. భగవత్ విశ్వాసమును ప్రజలలోపల పెంపొందింపచేయండి. అనాదికాలమునుండి దైవత్వాన్ని అనేక విధములుగా చాటినటువంటి దేశము, యీ భారతదేశము. కానీ, ఏనుగు యెటుల తన బలము యెరుగలేదో అట్టులైనారు మన భారతీయులు నేడు. తమ బలమును తమ శక్తిని తమ విశ్వాసమును తాము గుర్తించుకోలేకపోతున్నారు. మనమెందులకు దీనులమవుతున్నాము? మనమెందులకు తక్కువ వారమవుతున్నాము? మనకు ధనము లేదా, గుణము లేదా, బలము లేదా? సర్వబలములుకూడను దైవత్వమునందే యున్నవి. విద్య గరిపేటువంటివాడు, బుద్ధి కలిగింప చేసేటువంటివాడు, ఉద్ధారకము చేసేటువంటివాడు భగవంతుడే. అట్టి భగవంతుడే మీ అండదండలుగా వుంటున్నప్పుడు పరుల యెదుట యెందుకు చేయిచాపాలి? మహాశయులారా! పవిత్రమైనటువంటి మీ జీవితము యెంతనో ధన్యమైనటువంటిది. కాల, కర్మ, కారణ, కర్తవ్యములు కలసి వచ్చినప్పుడు భగవంతుని కరుణకూడను చేరవస్తుంది. పరిపక్వస్థితికి వచ్చినపుడు వృక్షమునుంచి వైరాగ్యముతో ఆ ఫలము క్రిందరాలుతుంది. మీరు సమాజములో ప్రవేశించి ప్రజలలోపల యీ దైవభావమును, పాపభీతిని నెలకొల్పి, వారిని ఆధ్యాత్మికముగా అభివృద్ధిగావించటానికి, మీతో అనేకవిధములుగా సహకరించటానికి తగిన కృషిచెయ్యండి. మీకు అయినటువంటి ఖర్చులుగానీ, బాధ్యతలుగానీ నేను

srisathyasai vachanamrutam

చూచుకుంటాను. అంతేకానీ పరుల దగ్గరకి పోయి వారిని ఆశ్రయించి వారిముందు యేమాత్రంకూడను తలవంచకండి. నాకు మీపై వున్నటువంటి ప్రేమతత్త్వముచేత, యెంతో నిర్మలచిత్తులు, నిస్స్వార్థపరులు అయిన మీ అవస్థలు గమనించి నాకెంతో కష్టంగా వుంటున్నది. మిమ్మల్ని ఆదరించేవారు మీ మనసు ఎంతో కష్టపెట్టి తదుపరి ఆదరించటానికి పూనుకుంటున్నారు. అందుచేత ఒకరితో అనిపించుకోవటానికి మీరు యేమాత్రము అవకాశము యివ్వకండి. ప్రపంచములో యెన్ని కోట్లమందో వున్నారు. అందరూ సన్యసించారా? ఇది ఒక అదృష్టము. మీ యొక్క భాగ్యము. ఇది ప్రయత్నముతో లభించేటువంటిది కాదు. అదృష్టముతోనే ప్రాప్తిస్తుంది. ప్రాప్తించిన యీ స్థానాన్ని సద్వినియోగము చేసుకొని యితరులుకూడను దానిని సద్వినియోగపరచటానికి తగిన కృషిచేయటమే నిజముగా మీ కర్తవ్యము. మీరు దైవమునకు ముద్దు బిడ్డలు. అందువలన దైవాజ్ఞ మీరు శిరసావహించి, అన్య ఆశలను కట్టిపెట్టి, దైవ ప్రచారమే మీ ప్రధానమైన కర్తవ్యమని విశ్వసించి దేశము ప్రాచీనకాలమందు యేవిధముగా వున్నదో ఆవిధముగా తిరిగి పునరుద్ధరించటానికి కంకణము కట్టుకోవాలని నేను ఆశిస్తున్నాను. దైవ నామమునకు మనము భేదము యేమాత్రము బోధించరాదు. ఏ నామము, ఏ రూపము, ఎవరిచ్ఛ యేరీతిగా వుండునో ఆ రీతిగానే దానిని అనుసరించమని ప్రజలకు బోధించాలి. జాతి, మత, కులముల భేదములను యేమాత్రము మనము ప్రోత్సహించరాదు. కారణమేమనగా, మీరు యేజాతికి చెందినవారు కారు. ఏ మతమునకు చెందినవారు కాదు. దైవమతమునకు మాత్రమే చెందినవారు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనేటువంటివి సామాన్యమైన అమాయకులు అనుభవించేటువంటివి.

**అందరూ భగవంతుని బిడ్డలే!**

> **శాస్త్రంబునెప్పుడు సత్యంబుగానెంచు వేద సమ్మతమగు విప్రులారా!**
> **దేశంబు కొరకునై దేహ మర్పణచేసి రమియించు రాజాధిరాజులార**
> **ధనధాన్యములు కల్గి ధర్మగుణంబులతో అరయుచుండెడి ఆర్యవైశ్యులార**

sri sathyasai vachanamrutam

## వ్యవసాయ వృత్తిచే వర్థిల్లుచుండి సుఖజీవనముచేయు శూద్రులార

మీరందరు ఆ విరాట్పురుషుని దేహమునందు అంగములే! దీనినే పురుషసూక్తమునందు "బ్రాహ్మణోస్య ముఖమాసీత్ బాహూరాజన్యః కృతః....." అని వర్ణింపబడింది. బ్రాహ్మణులనేటువంటివారు ముఖమువంటివారట, క్షత్రియులు భుజములవంటివారట, వైశ్యులు తొడలవంటివారట, శూద్రులు పాదములవంటివారట! ఈ నాలుగు చేరిననే కదా, దేహము! దీనిలో ఒక అంగముయొక్క ప్రత్యేకత యెక్కడ వుంటున్నది? అంతా చేరి ఒకే దేహము. అంతా ఒక్కటే! అంతా ఒక్కటే. ఇవన్నీ కేవలము దేహములో వుండినటువంటి అంగములయొక్క పేర్లు మాత్రమే. జాతి, మతములపేర్లు కాదు. కాలికి ముల్లుగుచ్చుకుంటే కన్ను యేడుస్తుంది. అనగా శూద్రులు బాధపడుతుంటే బ్రాహ్మణులు బాధపడాలి. దానికి విచారించాలి. అలాగే తలకు యేదైనా బాధగావుందంటే కాలు ఒక్క అడుగైనా ముందంజవేయలేదు. కనుక, వీరందరు అన్యోన్యఅనురాగముతో సంబంధబాంధవ్యముతో జీవించటానికి ఒక విధమైనటువంటి సంబంధము కూడివుంటున్నది. ఇందులో యేమాత్రంకూడను భేదమును పాటించరాదు. భాషలు వేరు కావచ్చును, నామములు వేరుకావచ్చును, కానీ అందరూ ఒకే జాతికి చెందినటువంటివారు. అదే మానవజాతి. ఈ జాతికి అంతకూ ఒక్కడే తండ్రి, అతడే భగవంతుడు. అందరూ ఆ భగవంతుని బిడ్డలే అనేటువంటి సమత్వమును పెంచుకుంటూ, బోధించుకుంటూ రావాలి. ఇదే నిజమైన మన అభిమతము కావాలి. ఇదే ఋషులయొక్క వ్రతము అని బోధించాలి. ఇదే మానవ మతముగా తేజరిల్లాలి. ఈ విధమైన భావములచేత మీరు యీ సమాజములో ప్రవేశించి మీ కర్తవ్యమును నిర్వర్తించటానికి మీ కడపటి శ్వాసవరకును 'మానవసేవయే మాధవసేవ' అనేటువంటి ఆదర్శములో మీ జీవితాన్ని అంకితం చెయ్యాలి.

### అందరూ కలిసిమెలిసి పెరగాలి, తిరగాలి, తెలుసుకున్న జ్ఞానజ్యోతిని వెలిగించాలి

ధనమునకు మీరు యేమాత్రంకూడను విచారించనక్కరలేదు. కల్పవృక్షము, కామధేనువు అయినటువంటి భగవంతుడు మనవెంట, జంట, యింట వున్నప్పుడు మనకు విచారమెందుకు? ఆ విశ్వాసము లేనటువంటివారికే విచారము. మన ప్రవర్తన మనము

సరియైనటువంటి రీతిలో ప్రవేశపెట్టాలి. కొన్నికొన్ని దురభ్యాసములు దూరముచేసుకోవాలి. రాగద్వేషాదులు నిర్మూలనము గావించాలి. సన్యాసులలోనే ఒకరితో ఒకరికి యేవిధమైనటువంటి భిన్నాభిప్రాయములు రాకూడదు. ఈ విధమైనటువంటి పరిపూర్ణభావముతో మనము వుండినప్పుడే నిజమైన మానవత్వాన్ని వుద్ధరించటానికి తగినటువంటి అధికారులమవుతాము. దీనినే వేదమునందు "సహనావవతు సహనౌ భునక్తు సహవీర్యం కరవావహై.." అని చెప్పబడింది. యీ మంత్రం యెందుకోసం చెప్పారు? దీనియొక్క అంతరార్థము యేమిటి?

**కలసిమెలసి తిరుగుదాం కలసిమెలసి పెరుగుదాం**
**కలసిమెలసి తిరుగుదాం కలసిమెలసి పెరుగుదాం**
**కలసిమెలసి కలిమిచెలిమి బలము గుణము పెంచుదాం**
**కలసి మెలసి తెలుసుకున్న తెలివిని వెలిగించుదాం**
**కలసి మెలసి కలిమితోడ చెలిమిగ జీవించుదాం**
**శాంతి శాంతి శాంతి యని శాంతి పూజ చేయుదాం**
**ఓం ఓం ఓం అనుచు ఓంకారము పాడుదాం**

ఇదే "సహనావవతు, సహనౌభునక్తు", అనునటువంటి శ్లోకమునకు అర్థము. మనమందరము కలసిమెలసి పెరగాలి. కలసిమెలసి తిరగాలి. మనము తెలుసుకున్నటువంటి జ్ఞానజ్యోతిని వెలిగించాలి. ఆ వెలుగు బాటలో అడ్డంకులను తొలగించుకొని ముందుకు సాగిపోవటానికి తగినటువంటి బలమును సంపాదించుకోవాలి. కలసి మెలసి కలత లేక చెలిమిగ జీవించుదాం. కలతలేకుండా జీవించాలి. అప్పుడే మనకు శాంతి. అదే శాంతిపాఠము 'శాంతి, శాంతి, శాంతి'. మనలోనే శాంతి లేకపోతే యిక మనం శాంతి దేనికోసం చెబుతున్నాము? ఈ శాంతినికూడను శాంతముగానే చెప్పాలి. యిలాంటి పవిత్రమైన భావములు మీయందు లేకపోలేదు. నేను ప్రత్యేకముగా మీకు చెప్పటమనికాదు. కానీ, మనలో వున్నటువంటి దోషములను తొలగించుకుని, మంచిని చేర్చుకోవటము మన

srisathyasaivachanamrutam

కర్తవ్యము. కనుకనే నేను వున్న విషయములంతా మీకు యీవిధముగా విపులముగా తెలుపుతూ వచ్చాను. మీరు వేరుగా భావించరాదు. మీరు దేశాన్ని యెంత ముందుకైననూ తేవటానికి తగిన సామర్థ్యములు కలిగినటువంటివారు. కనుక, మీరు మీయొక్క శక్తిని తలుచుకుంటూ 'ఏకోహంబహుస్యాం' అని భగవంతుడే స్వయంగా తనకు తాను సంకల్పించుకొని జగత్తంతా యేవిధముగా సృష్టించెనో ఆవిధముగా మీరుకూడా మీలోవున్న జీవశక్తిని ప్రకటింపజేసుకుని ఆనందాన్ని పొందాలి. అదే మీకు ధైర్యమునిస్తుంది. మనము బలహీనులమని యేమాత్రము భావించకుండ సర్వబలములు మనయందున్నవనే విశ్వాసాన్ని పెంచుకుంటే సర్వశక్తులు మీయందు చేరుతాయి. మీలో భజనలు తెలిసినవారు సమాజములో ప్రవేశించి నగరసంకీర్తనము చేస్తూ సాయంకాలము గ్రామస్థులందరిని చేర్చి వారితో భజన చేయించండి. ఉపన్యసించగలవారు గ్రామములో ప్రవేశించి ప్రతి సాయంత్రము యిండ్లకు చేరే రైతులను సమావేశపరచి భగవత్ తత్త్వాన్ని వారి హృదయాలకు హత్తుకునేటట్లుగా బోధించండి. ఈనాడు ముఖ్యముగా గ్రామీణ ప్రజలు అనేక దురభ్యాసములచేత తమ సంసారములను కూల్చుకుంటున్నారు. మీరు వారి దురభ్యాసములను మాన్పించి, సదభ్యాసములను పెంపొందింపచేసి, వారి కుటుంబములకు ఆనందాన్ని అందించండి.

**(తేదీ 4-1-1987న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahini amrutam